ఇక ఇరవై నాలుగు గంటలు జీవించి పిదప మరణించిన శిశువుకు ఇరవై ఒక్కవేల ఆరువందల శ్వాసలు మాత్రమే వుండి అవి ఖర్చయిపోతే ఆ శిశువు మరణిస్తుంది. మూడు నెలలు జీవించి మృతి చెందిన శిశువుకి పంధొమ్మిది లక్షల నలభై నాలుగు వేల శ్వాసలుంటాయి.

అయిదు నెలలు జీవించి మృత్యువాత పడిన శిశువుకి ముప్పైరెండు లక్షల నలభైవేల శ్వాసలుండి అవి ఖర్చయిపోయిన మరుక్షణం ఆ శిశువు మరణిస్తుంది. పది సంవత్సరాలు జీవించి మృతిచెందిన వారికి ఏడుకోట్ల డెబ్బైకోట్ల డెబ్భైఏడు లక్షల అరవై వేల శ్వాసలు. నలభై ఏళ్ళు జీవించి మృతిచెందిన వారికి ముప్పై ఒకకోటి పదిలక్షల నలభై వేల శ్వాసలుంటాయి.

ఎనభై ఏళ్ళు జీవించి మృతి చెందిన వారికి అరవై ఆరు కోట్ల తొమ్మిది లక్షల అరవైవేల శ్వాసలుంటాయి.

ఈ శ్వాస నివసించు స్థానము 'నాభి' మానవుల ఆయువుకి ప్రమాణము. జ్యోతిష్కులూ, హస్త సాముద్రికవేత్తలు గుణించి చెప్పే సంవత్సరాల లెక్క కాదు. మన నాసికా ద్వారములగుండా నడుస్తున్న శ్వాసే.

అన్ని జీవరాశుల హృదయ కమలంలో నివసించుచున్న ఆత్మ అనే దేవుడు ఆయా వ్యక్తులు ఎంతకాలము జీవించవలెనో అంతవరకూ కావలసినంతవరకు శ్వాసము బొడ్డులో చుట్టగా చుట్టి వుంచుతాడు.

ఈ బొడ్డును 'కుండలినీ శక్తి' అని అంటారు. బొడ్డులో చుట్టగా చుట్టబడిన శ్వాస ప్రతి దినమూ, దివారాత్రులు కూడా క్షణమైనా విశ్రమించక మనం ఉచ్ఛ్వాస నిశ్వాసలు ద్వారా విడువబడినపుడు కుడి నాళికలోంచి వచ్చినపుడు ఎనిమిది అంగుళముల పొడుగంత శ్వాస వెలుపలికి వచ్చి, అందు నాలుగు అంగుళముల పొడవంత శ్వాస బయట నష్టమై, మిగిలిన నాలుగు అంగుళముల పొడవుగల శ్వాస బయటనున్న మంచిగాలిలో కలిసి తిరిగి నాభిలో నున్న శ్వాసనుంచి నాలుగంగళముల పొడవంత శ్వాసతో కలిపి ఎనిమిది అంగుళముల పొడవు శ్వాసను తీసుకొని వెలుపలికి వస్తుంది.

అదే మళ్ళీ నాలుగంగుళముల శ్వాస వెలుపల నష్టమై, మిగతా నాలుగంగుళముల శ్వాస మంచి శ్వాసయై లోపలికి వెళుతుంది.

అదే ఎడమ నాసికనుండి శ్వాస నడుస్తున్నప్పుడు పన్నెండు అంగుళముల శ్వాస బయటకు వచ్చి, దానిలో నాలుగు అంగుళముల శ్వాస నష్టమై తిరిగి ఎనిమిది అంగుళముల పొడవైన శ్వాస లోపలకు వెలుతుంది. అదే తిరిగి వెలువలకు వచ్చునపుడు లోపల చుట్టగా చుట్టి వుండే శ్వాసలో నాలుగు అంగుళముల పొడవంత శ్వాసను వెలుపల విడిచేస్తుంది.

ఈ పద్ధతిలో ప్రతిరోజూ ఇరవై నాలుగు గంటల కాలంలో ఇరవై ఒక్కవేల ఆరువందల శ్వాసలు కుడి, ఎడమ నాశికలలో నుంచి నడుస్తూంటుంది.

ఈ విధంగా ఇరవై ఒక్కవేల ఆరువందల శ్వాసల్లోంచి ఒక్కొక్క శ్వాస నాలుగు అంగుళముల పొడవు శ్వాసగా నష్టమవుతూ మానవకోటి ఆయు ప్రమాణాన్ని తగ్గిస్తూ ఉంటుంది. ఈ రహస్యం సిద్ధిపొందిన యోగులకు తప్ప మామూలు వారికి తెలియదు.

అంతేకాదు మానవుల అన్ని ఆశలకూ, కోరికలకూ తలంపులే ముఖ్య కారణం. ఆ తలంపులు లేకుంటే ఏ ఆశలూ, కోరికలూ వుండవు.

ఆశలకు తలంపులే బీజము. ఈ తలంపులన్నీ శ్వాసలో పుడుతుంటాయి. యోగాభ్యాసము ద్వారా శ్వాస వేగాన్ని పొగరును అణిచివేస్తే శ్వాస వేగంగా లేక ముక్కు కొనయందుండి. ఒక్క అంగుళము పొడవుగల శ్వాస తిన్నగా కిందికి ..... ఎటువంటి తలంపులూ పుట్టకుండా వుంటాయి.

నీకు ప్రాణవాయువు అందని ప్రదేశంలో సైతం నాకు అందుటకు శ్వాసని నియంత్రించుకోవటమే. ఇక నీకు స్వస్థత చేకూరింది నా యోగ శక్తి వలన. దానితో నీలో శ్వాస వేగాన్ని నియంత్రించి, నా కరస్పర్శ ద్వారా నీకు శ్వాస అందేలా చేయటమే కారణం ..... ' అని వివరించాడు.

దాంతో మనిషి ఆయుష్షు మనం నిత్యం జరిపే ఉచ్ఛ్వాస, నిశ్వాసలమీదే ఆధారపడి వుందని తెలిసింది నాకు ..... "అంటూ ఒక్కక్షణం ఆగాడు వరప్రసాదం. అతడు చెప్పిన విషయాలు అభిరాంని ఆశ్చర్యానికి, ఉద్వేగానికీ లోను చేశాయి.

వరప్రసాదం నశ్యం డబ్బాలోంచి కొంత తీసుకుని పీల్చి, తుమ్మాడు. అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలవుతోంది.

"మీకు నిద్రొస్తోందా?" అడిగాడు వరప్రసాదం.

"లేదు" బదులిచ్చాడు అభిరాం.

"అయితే హిమాలయాల్లో ఒక ఘోరీతో నాకు జరిగిన అనుభవం చెబుతాను వినండి" అన్నాడు.

ఇంకా 'నాకు నిద్రొస్తుంది పడుకుంటాను' అని వరప్రసాదం అంటాడేమో అని ఊహించుకున్న అభిరాం అతడలా అనకపోవటంతో అతనిలోని ఉద్వేగం రెట్టింపయింది.

"హిమాలయాలపై నేను సంచరిస్తుండగా ఒక ప్రదేశంలో కొందరు వ్యక్తులు తారసపడ్డారు. మాటల్లో వారిది శ్రీనగరనీ, ఈ ప్రాంతంలో సంచరించటం మంచిది కాదనీ అన్నారు. నేను కారణం అడిగాను. ఇక్కడికి దగ్గరలోని ఒక గుహలో ఓ అఘోరీ వున్నాడని అతని కంటపడటం మంచిదికాదని చెప్పి వాళ్ళు ముందుకు సాగిపోయారు. అది మానస సరోవర ప్రాంతం. కైలాస గిరులున్నవీ అక్కడే.

నాకెలాగైనా ఆ అఘోరీని చూడాలని అనిపించి వారు చెప్పిన గుహ వైపు నడిచాను. ఆ పరిసరాలలో ఏ అలికిడీలేదు. ధైర్యం చేసి లోపలకు వెళ్ళాను. లోపల రాతి మీద ఓ ఆకారం కూర్చుని వుంది. నా అలికిడికి ఆ ఆకారం దిగ్గున లేచి నుంచుంది.

సుమారు ఆరడుగుల అయిదంగుళాల ఎత్తులో, బలిష్ఠంగా, పొడవాటి జుట్టు, గడ్డం, జనపనార గోచీ-ఇదీ ఆ ఆకారం  అవతారం. అతడే అఘోరీ అయుంటాడని అనుకున్నాను నేను. అతని చేతికి ఏదో తీగలు చుట్టుకుని వున్నాడు.

'ఈ పరిసరాలలో తిరగడం ప్రమాదమనీ, ఇక్కడో అఘోరీ ఉంటాడు--అతనికంట పడటం మంచిది కాదని నీకు వాళ్ళు చెప్పారు కదా! అయినా ఇక్కడికి వచ్చావేమిటీ? నీకు భయంలేదా?' నన్ను చూస్తూనే అడిగాడతను.

నాకు నోటమాట రాలేదు. ఈ గుహ వద్దకు వెళ్ళొద్దని శ్రీనగర్ వాసులు నన్ను హెచ్చరించిన ప్రదేశం అఘోరీ గుహకు ఫర్లాంగు దూరమైనా వుంటుంది. అయినా ఇతనికి వాళ్ళు నాతో చెప్పిన మాటలు ఎలా తెలిశాయని ఆశ్చర్యపోయాన్నేను.

'ఏమిటి వాళ్ళు నిన్ను హెచ్చరించిన సంగతి నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా?' అడిగాడతను. నా తల గిర్రున తిరుగుతున్నట్లయింది. అతడు తిరిగి రాతిమీద కూర్చుని, నన్ను రమ్మని పిలిచాడు.

నేను ముందు సందేహించినా అంతవరకూ వచ్చాక చేయగలిగింది లేక అతన్ని సమీపించాను. అతడు నన్ను తన పక్కన కూర్చోమన్నాడు. నేను మారు మాట్లాడకుండా కూర్చున్నాను.

అతని శరీరం నుంచి భయంకరమైన దుర్వాసన కొడుతోంది. హఠాత్తుగా నా కళ్ళు ఓ మూల పడివున్న మనిషి పుర్రెలు, ఎముకల్నీ పసికట్టాయి. 'ఇతను మనుష్యుల్ని తినేవాడా?' ఆ ఆలోచన వస్తూనే నాలో సన్నగా వణుకు మొదలయింది.

'ఇక్కడికి దగ్గరలో, కుడివైపు వెళితే నదొకటి వుంది. అక్కడికి పోయి కుండతో నీళ్ళు పట్రా పో!' అన్నాడతను ఓ కుండ నా చేతికిచ్చి. నాలో వణుకు తగ్గలేదు. అలాగే వెళ్ళాను. గుహకు దగ్గరలోనే నది వుంది. కుండ ముంచి నీళ్ళు తీసుకున్నాను. అక్కడ్నుంచి పారిపోదామా అనిపించినా ఏం జరుగుతుందో చూద్దామనే ఉత్సాహం ఆ కోరికని చంపేసింది.

నీళ్ళ కుండతో గుహలో నడిచాను.

'పారిపోదామనుకున్నావు కదూ' నన్నే తీక్షణంగా చూస్తూ అడిగాడతను. నేను మౌనంగా తల వంచుకున్నాను. 'సరే! నదిలో శవం తేలివస్తుంది. దానిని ఒడ్డుకు లాగి, తొడ, కండరాలుకోసి కొంత మాంసం పట్రా' అన్నాడతను. నాకు షాక్ తిన్నంత పనైంది. కదలకుండా అక్కడ నిల్చుండిపోయాను.

'మాంసం కోసి తెస్తావా? లేకుంటే నిన్ను కోసి మాంసం తీసుకోవాలా? నీకేది యిష్టం?' గర్జనలా వినిపించిన అతని గొంతుకి, దిక్కు తోచక అతడందించిన కత్తి తీసుకుని నది వద్దకు వెళ్ళాను.

సరిగ్గా అప్పుడే నదిలో ఓ పురుషుడి శవం తేలుతూ వచ్చింది. దాన్ని తాకడానికే ముచ్చెమటలు పోశాయి నాకు. అయినా తప్పదుకదా! ఆ శవాన్ని ఒడ్డుకు లాగి తొడ,

కండరాలు కోయసాగాను.

ఆ శవం భయంకరమైన దుర్గంధం కొడుతోంది. భయం, ఆందోళన, కంగారువల్ల శవాన్ని కోస్తుండగా నా చేతివేళ్ళు రెండు కోసుకుపోయి రక్తం ధారగా కారసాగింది.

అలాగే కోసిన మాంసం పట్టుకొని అఘోరీకి యిచ్చాను. అతడు తెగిన నా చేతివేళ్ళ వంక చూసి దగ్గరకొచ్చాడు. నేను బిత్తర చూపులు చూస్తుండగా అతడు నా వేళ్ళని తాకాడు.

ఆశ్చర్యం ..... !

తెగిన నా చేతివేళ్ళనుంచి కారుతున్న రక్తం ఆగిపోయింది. అక్కడ గాట్లుకూడా మటుమాయమైపోయాయి. అప్పుడుపోయింది నాలో ఆ అఘోరీ మీదున్న అనుమానం-భయం.

'ఈ మాంసం నేను తినబోతున్నాను ఇప్పుడు' అన్న ఊహ నాలో కంపరం కలిగించింది. అయినా అతను చెప్పినట్లే రెండు ఆకులలో వడ్డించాను. కుండలోంచి తీసి ఆకులో వేసిన పదార్థం చూసి నాకు మతిపోయినంత పనైంది. అది మాంసం కాదు. నాకెంత ఇష్టమయిన గులాబ్ జాం.

"ఇందులో మాంసం లేదులే తిను" అన్నాడతను. మౌనంగా తిన్నాను. చాలా రుచిగా వుందది.

'ఎలా వుంది?' నన్ను ప్రశ్నించాడతను. చాలా బాగుందన్నాన్నేను. అఘోరీల గురించి ఇంతకుముందు విన్నా, చూడటం అదే మొదటిసారి.

'నువ్వు కాస్సేపు విశ్రాంతి తీసుకో. నేను ధ్యానం చేయాలి' అని అఘోరీ కళ్ళు మూసుకున్నాడు.

నా మెదడంతా ఆలోచనలు ప్రశ్నలతో చిందర వందర అయిపోయింది.

ఎక్కడో మాట్లాడుకున్న మాటలు, నదిలో శవం కొట్టుకొస్తున్న సంగతీ ఇతనికెలా తెలిశాయి? దివ్యదృష్టి తెలుసా ఇతనికి? ముందు తారస పడిన యోగి సాత్వికంగా, శాంతంగా వుంటే ఇతడేమిటి ఇలా అసహ్యంగా వున్నాడు? పైగా మాంసం తింటానంటున్నాడు. స్నానం చేసి ఎన్నాళ్ళయిందో ..... ఆ దుర్గంధంతో ఎలా మనగలుగుతున్నాడో? అసలేమిటీ అఘోరీల జీవన విధానం?

నా ఆలోచనల్ని చెదరగొడుతూ 'నిన్ను విశ్రాంతి తీసుకోమంటే ఎందుకు అన్ని ఆలోచనలు చేస్తున్నావ్?' అని గంభీరంగా వినిపించింది అఘోరీ కంఠం. నేను తప్పు చేసినవాడిలా అతని వంక చూశాను. అప్పుడతను నా చెంతకొచ్చి కూర్చున్నాడు.

"అఘోరీల జీవన విధానం తెలుసుకోవాలనివుందా?" అని సౌమ్యంగా అడిగాడు.

ఒకే మనిషిలో రెండు విభిన్న కోణాలు. "ఇందాక కఠోరంగా మాట్లాడినది ఇతనేనా? ఎంత సౌమ్యంగా తన మనసులో విషయాన్ని అడిగాడిప్పుడు" అన్పించింది నాకు. అతని ప్రశ్నకు తలూపాను.

“అఘోరీలంటే తాంత్రికులు. నేనూ అఘోరీనే. ఏ వ్యాధులనైనా అఘోరీలు నయం చేయగలరు. ప్రాణశక్తికన్నా సూక్ష్మ మైన రహస్యాలు మాకు తెలుసు. ఈ సూక్ష్మశక్తి ఇహ పరాలకి వారధి ..... ” అని ఆగాడు అతను. నాకు కొంచెం ధైర్యమొచ్చి

“మీరు శవాలు ఎందుకు తింటారు?” అనడిగాను.

“ఇది శవం ఎందుకయింది? ఇదిప్పుడు మనిషికాదు. దీనిని ఎవ్వరూ వాడటంలేదు.

నీవు ఇది మనిషిదనుకుంటావు. ఎవరూ వాడని దాన్ని నేను వాడుకుంటాను. నేనో శాస్త్రజ్ఞుడిని. పదార్థం, శక్తి నియమాల గురించి ప్రత్యక్షంగా చేస్తున్నవాడిని. పదార్థాన్ని ఒక రూపం నుండి మరో రూపానికి మార్చుతున్నాను.

ప్రకృతిమాత నా గురువు. ప్రకృతి పలురూపాలలో వుంటుంది. నేను ఆమెనే అనుసరిస్తున్నాను.

ఈ గుహలో పదమూడు సంవత్సరాలుగా వుంటున్నాను. ఇంతవరకూ నా కోసం ఎవ్వరూ రాలేదు. నా రూపం చూసే అందరికీ భయం.

నేను మురికిగా వుంటానని, చేపలు, శవాలు తింటానని నన్ను అసహ్యంచుకుంటారు. అయినా ఫర్వాలేదు. నాకు ఎవ్వరూ అక్కర్లేదు.

మాకు రూపాలు మార్చే శక్తి వుంది. అదుగో ఆ శిలని తీసుకురా’ అని ఎదురుగా కన్పించిన ఓ రాయిని చూపించి అన్నాడు. నేను వెళ్ళి ఆ రాతిని అతనికి అందించాను. అఘోరీ చేతిలో చూస్తుండగానే ఆ శిల పొడిగా అయిపోయింది.

దాన్ని కొంచెం నా నోటిలో వేశాడతను. అది తియ్యగా వుంది.

“ఇప్పుడు ఇది చక్కెర” అన్నాడతను.

నేను అతని చేతిలో మిగిలిన చక్కెరని తీసుకుని ఓ డబ్బాలో భద్రపరుచుకున్నాను ..... ”

“ఇప్పుడు మీ దగ్గరుందా అది” అడిగాడు అభిరాం.

“ఉంది ..... ” అంటూ బ్రీఫ్‌కేసులోంచి ఓ డబ్బా తీశాడు వరప్రసాదం.

అభిరాంకి ఎగ్జయిటింగ్‌గా వుంది. ‘ఓ తాంత్రికుడి మహిమవల్ల చక్కెరగా మారిన శిలని చూడబోతున్నాడు తను’ అనుకున్నాడు. వరప్రసాదం డబ్బామూత తీసి అభిరాంకి చూపించాడు. అందులో తెల్లగా మెరుస్తూ కన్పించింది చక్కెర. అయితే చాలాకాలం అయిపోవటంతో తేమ పట్టేసి వుందది. వరప్రసాదం డబ్బాలోంచి చూపుడువేలితో కొంత చక్కెర తీశాడు. అది పాకంలా వేలికి అంటుకుని వుంది.

“రుచి చూడండి” అంటూ అభిరాంకి వేలికి కొంచెం పూశాడు.

అభిరాంకి వేలుని చప్పరించాడు, తియ్యగా వుందా జిగురు. వరప్రసాదం కూడ వేలికున్న చక్కెరని చప్పరించి డబ్బా మూత పెట్టి బ్రీఫ్ కేసులో దాన్ని దాచేశాడు.

“తరువాత ఏమైంది?” అడిగాడు అభిరాం.